# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 25-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కర్ణాటకలోని హోస్ పేటలో తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్‌వే గేట్లను ప్రారంభించిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి**

2. **రేపు మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.**

3. **దేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత క్లిష్టమైన కాలంగా నిలిచిందని పేర్కొన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**

4. **రాష్ట్రంలో యోగాను ప్రజల దైనందిన జీవితంలో భాగం చేసే లక్ష్యంతో 'ఇంటింటికీ యోగా' కార్యక్రమానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

==========================

కర్ణాటకలోని హోస్ పేటలో తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్‌వే గేట్లను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిలు ఈ రోజు ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోవడంతో నిపుణుల కమిటీ సూచనతో 51 కోట్ల రూపాయలతో 33 కొత్త గేట్లను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం హోసపేటలో జరుగుతున్న బహిరంగ సభలో కేంద్ర మంత్రి, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు.

--------------------------

రేపు మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సత్యం, విశ్వాసం కోసం తన ప్రాణాలను అర్పించిన ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ అమరత్వాన్ని మొహర్రం గుర్తుజేస్తుందని ఈ రోజు విడుదల చేసిన సందేశంలో ఆయన పేర్కొన్నారు. మంచితనం, త్యాగం, ధర్మబద్ధతకు ప్రతీకగా నిలిచిన ఆయన జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని వెల్లడించారు. మొహర్రం నిజమైన అర్థం మంచితనం, త్యాగాన్ని స్మరించుకోవడమేనని, ఆత్మపరిశీలన, స్మరణ, ఆధ్యాత్మిక భక్తికి ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ వివరించారు. మానవతావాదాన్ని ప్రతిబింబించే మొహర్రం స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ

అనుసరించాలని ఆయన ఆకాంక్షించారు.

---------------------------

దేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత క్లిష్టమైన కాలంగా నిలిచిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 'సంవిధాన్ హత్యా దివస్' సందర్భంగా స్వేచ్ఛ, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ ఎంత ముఖ్యమో చరిత్రలోని కొన్ని అధ్యాయాలు గుర్తు చేస్తాయని సామాజిక మాధ్యం ఎక్స్ లో వెల్లడించారు. ఎమర్జెన్సీ కాలంలో భారీ ఎత్తున అరెస్టులు, పౌర హక్కులపై ఆంక్షలు అమలయ్యాయని తెలిపారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, జర్నలిస్టులు నిర్బంధానికి గురయ్యారని, పత్రికలు, ప్రచురణలపై నియంత్రణలు విధించబడినట్లు గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఆ ఘటనలు స్పష్టం చేశాయని కిషన్ రెడ్డి తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 27న వెలిగొండ ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. దోర్నాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రదేశాలను జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి కలెక్టర్ నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించడంతో పాటు నిర్వాశితులకు పరిహారం చెక్కులను ముఖ్యమంత్రి అందజేయనున్నట్లు తెలిపారు. నిర్వాసితుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో 905 కోట్ల రూపాయలను కేటాయించినట్లు కలెక్టర్ పేర్కొంటూ..

వాయిస్..30

---------------------------

రాష్ట్రంలో యోగాను ప్రజల దైనందిన జీవితంలో భాగం చేసే లక్ష్యంతో 'ఇంటింటికీ యోగా' కార్యక్రమానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర-2026 కార్యక్రమాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా నిన్న నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాల నుంచి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల వరకు యోగాసనాల కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ప్రతిరోజూ యోగాను ఆచరించేలా శాఖాపరంగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యోగా అండ్ నేచురోపతి ప్రచార పరిషత్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ, వార్డు స్థాయిలో శాశ్వత యోగా మందిరాల నిర్వహణ, యోగా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక అధికారుల నియామకానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

---------------------------

మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా, పల్లెపాలెంలో మత్స్యకార కుటుంబాలతో ఆత్మీయ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలు, జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మత్స్యకారులతో కలిసి పడవలో ప్రయాణించి చేపల వేట విధానం, బోట్ల వినియోగం, ఆదాయం, కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. డీజిల్‌పై ప్రస్తుతమున్న సబ్సిడీని పెంచాలని,

వలలు, బోట్లు, ఇంజన్ల కొనుగోలుపై సబ్సిడీ కల్పించాలని ఈ సందర్భంగా మత్స్యకారులు కోరారు. అలాగే ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్లు, పక్కా గృహాల నిర్మాణం వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

---------------------------

జూన్ 25, 1975న, అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈరోజుని 'సంవిధాన్ హత్య దివస్ – రాజ్యాంగ హత్య దినంగా పాటిస్తోంది. 1975లో అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్న వారందరిని స్మరించుకుంటూ, ప్రతి భారతీయునికి వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణపై అవగాహన కల్పిస్తుంది. హింసను ఎదుర్కొన్నప్పటికీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి పోరాడిన లక్షలాది మంది స్ఫూర్తిని గౌరవించడమే 'సంవిధాన్ హత్య దివన్ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

స్వయం సహాయక సంఘాలకు రుణాల వృద్ధి తగ్గడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆందోళనకరమని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఇచ్చేరుణాల వృద్ధి, పెట్టుబడులు తగ్గడంతో తద్వారా గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుందని ఇది గ్రామీణ ప్రజల ఆర్థిక ఇబ్బందులకు సంకేతమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ఆదాయంలో 3.22 శాతం తగ్గుదలకు ఇది నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం వెల్లడించింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్.. 25

=====================